క్లుప్తంగా

159 బేళ్లు తిరస్కరణ

కొండపి: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో మంగళవారం నిర్వహించిన వేలంలో 159 బేళ్లు తిరస్కరణకు గురైనట్లు వేల నిర్వహణ అధికారి జి.సునీల్‌కుమార్ తెలిపారు. కామేపల్లి, పచ్చవ గ్రామాల నుంచి రైతులు 598 బేళ్లను వేలానికి తీసుకురాగా 439 బేళ్లను కొనుగోలుచేశారు. గరిష్ట ధర రూ.280, కనిష్ట ధర రూ.230, సరాసరి ధర రూ.254.78గా నమోదైంది. వేలంలో 15 కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

బాధితులను ఆదుకోవాలని వినతి



ఆర్డీఓకు వినతిపత్రం అందచేస్తున్న చైర్మన్ గఫార్

కనిగిరిరూరల్: రెండు రోజుల క్రితం కురిసిన అకాల వడగండ్ల బీభత్సానికి తీవ్రంగా నష్టపోయిన బాధితులకు సహాయం అందించి ఆదుకోవాలని మున్సిపల్ చైర్మన్ ఎస్కే అబ్దుల్ గఫార్ కోరారు. ఈ మేరకు మంగళవారం ఆర్డీఓ కేశవర్ధన్‌రెడ్డికి వినతిపత్రం అందచేశారు. తొలుత పట్టణంలోని కాశిరెడ్డి కాలనీ, సూరాపావిరెడ్డి కాలనీ, శంఖవరం, శివనగర్ కాలనీ, శివారు ప్రాంతాల్లో చైర్మన్ పర్యటించారు. గాలివాన బీభత్సానికి మృతి చెందిన మహిళ కుటుంబానికి ఆర్థిక సాయం అందించాలని, కూలిన గృహాలకు పరిహారం ఇప్పించాలని వినతిపత్రంలో ఆర్డీఓకు చైర్మన్ విన్నవించారు.

అనుమతులు లేకుండా బాణసంచా విక్రయిస్తే చర్యలు



దుకాణాలను తనిఖీ చేస్తున్న ఎస్సై ప్రేమ్‌కుమార్

కొండపి: అనుమతులు లేకుండా బాణసంచా విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని ఎస్సై ప్రేమ్‌కుమార్ అన్నారు. స్థానికంగా ఉన్న బాణసంచా గోడౌన్లు, కిరాణా దుకాణాల్లో మంగళవారం సిబ్బందితో కలిసి ఆకస్మిక తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిల్వ ఉంచిన టపాసులు విక్రయించి ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడొద్దన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

పాఠశాలకు సిమెంట్ బెంచీల అందజేత



సిమెంట్ బెంచీలు అందజేస్తున్న దాతలు

సీఎస్‌పురం(పామూరు): కదిరి వెంకట నరసయ్య లక్ష్మమ్మ జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాల ప్లస్‌కు దాతలు సిమెంట్ బెంచీలు అందజేశారు. పాఠశాల ఎస్ఎంసీ చైర్మన్ మూరం మస్తానయ్య ఆభ్జర్యంలో రు.35 వేల విలువచేసే సిమెంట్ బెంచీలను దాతలు రాపూరి మోహనరంగారావు, పిడుగు సత్యనారాయణ, కదిరి రఘు, ఇరగని చెలపతిరావు, సుంకరి వీరాంజనేయులు, వాకా ఆదినారాయణ, మామిడేల రాజగోపాల్‌లు హెచ్ఎం నాగినేని తిరుపతయ్యకు అందజేశారు. పాఠశాలలు ముగిసేవరకు మజ్జిగ, మినరల్ డ్రింకింగ్ వాటర్‌ను ఇవ్వనున్నట్లు దాతలు కె.శ్రీనివాసరావు, శీలం మాలకొండారెడ్డి, చెరుకుపల్లి సత్యనారాయణరెడ్డి తెలిపారు.

డ్రాపౌట్స్‌ను గుర్తించి పాఠశాలల్లో చేర్పించాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ రామాంజనేయులు

కొండపి: డ్రాపౌట్స్ విద్యార్థులను, ఐదేళ్లు నిండిన పిల్లలను గుర్తించి ఆయా పాఠశాలల్లో చేర్పించాలని ఎంపీడీఓ రామాంజనేయులు అన్నారు. స్థానిక విద్యా శాఖ కార్యాలయ సమావేశ గదిలో జరిగిన అవగాహన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బంగారు బాల్యం కార్యక్రమంలో భాగంగా బడి బయట ఉన్న వారిని గుర్తించి ఆయా గ్రామాల పరిధిలోని పాఠశాలల్లో చేర్పించాలన్నారు. ఈ కార్యక్రమంపై యాక్షన్ ప్లాన్ నిర్ణయించి దిశా నిర్దేశం చేశారు. గుర్తించిన విద్యార్థులను 16వ తేదీ నుండి 19వ తేదీ వరకు పాఠశాలలో అడ్మిషన్లు నిర్వహిస్తామన్నారు. డ్రాపౌట్స్ గుర్తించడంలో మహిళా పోలీసులు, వెల్ఫేర్ అసిస్టెంట్లు కీలక బాధ్యతలు తీసుకోవాలన్నారు. ఎంఈఓ-2 రామారావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విక్టోరియా రాణి, ప్రధానోపాధ్యాయులు, , వెల్ఫేర్ అసిస్టెంట్లు, మహిళా పోలీసులు పాల్గొన్నారు.

మండలంలో మోస్తారు వర్షం

సీఎస్‌పురం(పామూరు): మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం సాయంత్రం ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన మోస్తారు వర్షం కురిసింది. దీంతో కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. మండలంలోని ఉప్పలపాడు పొలాల్లో తీవ్ర గాలులకు విద్యుత్ స్తంభం పడిపోయింది.

భౌభౌలతో బెంబేలు

- కనిగిరిలో హడలెత్తిస్తున్న గ్రామ సింహాలు
- వారంరోజుల్లో 40 మందిపై దాడి
- గుంపులు గుంపులుగా మీదపడి రక్కుతున్న వైనం
- భయాందోళన చెందుతున్న చిన్నారుల తల్లిదండ్రులు
- మొద్దు నిద్రలో మున్సిపల్ అధికారులు





కనిగిరి పట్టణంలో కుక్కల స్వైర విహారం

కనిగిరిరూరల్: పట్టణంలో పిచ్చికుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. నిత్యం ఏదో ఒక వీధిలో మనుషులు, మూగ జీవాలపై దాడి చేస్తూ గాయపరుస్తుండటంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. పట్టించుకోవాల్సిన అధికారులు మౌనవత్రం పాటిస్తున్నారు. కుక్కల బారిన పడి అనేక మంది గాయాల పాలవుతున్నారని, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని కౌన్సిల్ సమావేశాల్లో సభ్యులు కేకలు పెట్టినా.. ప్రజలు, బాధితులు సోషల్ మీడియా వేదికగా గగ్గోలు పెట్టినా.. మున్సిపల్ అధికారులు కనీసం దృష్టి పెట్టడం లేదు.. ఆదాయ వనరులపై చూపిన శ్రద్ధ.. ప్రజా రక్షణపై చూపించడం లేదనే విమర్శలు గుప్పుమంటున్నాయి.

స్వైర విహారం..

మున్సిపాలిటీ పరిధిలోని 20 వార్డుల్లో వీధి కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. ఒకటి కాదు.. రెండు కాదు.. ఏకంగా పదుల సంఖ్యలో కుక్కల సమూహం దాడి చేసి వృద్ధులను, చిన్నారులను గాయపరుస్తున్నాయి. 10, 9, 3, 4 వార్డుల్లో కోళ్లపై దాడి చేసి పీకలు కొరికి చంపగా.. మేకలు, గొర్రెలపై దాడి చేసి తీవ్రంగా దాడి చేయడంతో మృత్యువాత పడుతున్నాయి. పట్టణంలోని నిత్యం ఏదోక చోట కుక్కల దాడి జరుగుతూనే ఉంది. ప్రధానంగా పాతూరు, 13, 9, 11, 17, 3,4,5,6, వార్డుల్లో కుక్కలు గుంపులు గుంపులుగా సంచరిస్తున్నాయి. పట్టణంలో కొన్ని వీధుల్లో ఆటోల్లో, ద్విచక్ర వాహనాల్లో వెళ్లాల్సిన పరిస్థితి అయినా.. వదలకుండా బైక్‌లను కుక్కలు వెంబడించి మరీ దాడి చేస్తున్నాయి. ఇక కాలినడక వీధుల్లో రాత్రి వేళ వచ్చే వారి బాధలు వర్ణనాతీతం. దీంతో పట్టణ ప్రజలు కుక్కల ధాటికి భయాందోళన చెందుతున్నారు.

ఒక్క రోజులోనే 20 మందిపై దాడి

కనిగిరి ప్రభుత్వ ఆస్పత్రిలో గత నాల్గు నెలల నుంచి వచ్చిన కుక్క కాట్ల బాధితుల వివరాలను పరిశీలిస్తే.. జనవరి-ఫిబ్రవరి నెలలో 265 మందికి, ఫిబ్రవరి- మార్చి నెలలో 130 మందికి, మార్చి-ఏప్రిల్ నెలలో 230మంది కి కుక్కకాట్లు జరిగినట్లు అధికారులు తెలిపారు. అలాగే గడిచిన వారం రోజుల్లో సుమారు 40 మందికి పైగా కుక్క కాట్లకు గురికాగా.. సోమవారం పిచ్చికుక్క దాడిలో పట్టణంలో సుమారు 17మందిని గాయపర్చినట్లు వైద్యులు వెల్లడించారు. అందులో ఓ బాలుడికి తీవ్ర గాయాలయ్యాయి.

తల్లిదండ్రుల్లో ఆందోళన

కుక్కల ధాటికి చిన్నారుల, విద్యార్థుల తల్లిదండ్రులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఉన్నత తరగతులు తప్ప మిగిలిన తరగతుల విద్యార్థులందరికీ స్కూల్ యూనిఫాంలో అధిక శాతం లిక్కర్ ఉంటుంది. దీంతో కుక్కలు విద్యార్థులపై దాడి చేస్తే కుక్కలు పిక్కలు వదలకుండా పీకుతున్నాయి. మున్సిపాలిటీ పరిధిలోని చింతలపాలెం, శంఖవరం ప్రాథమిక, ఉన్నత పాఠశాలల వద్ద కుక్కలు గుంపులు గుంపులుగా సంచరిస్తున్నాయి. దీంతో పాఠశాలలు వదిలిన తర్వాత టీచర్లు బయటకు వచ్చి కుక్కలను తరిమి ఆతర్వాత విద్యార్థులను పంపించాల్సిన దుస్థితి. పట్టణంలోని కొత్తపేట, గార్లపేట రోడ్డుల్లోని స్కూల్స్, కాలేజీల కూడళ్లలో కుక్కలు, రాత్రి పగలు తేడా లేకుండా దాడి చేస్తున్నారు. రాత్రి వేళ స్టడీ అవర్స్‌కు వెళ్లి వచ్చేందుకు విద్యార్థులు జంకుతున్నారు. పాఠశాల వీధులు దాటే దాక విద్యార్థులంతా కలిసి ప్రయాణం చేసి, ప్రధాన సెంటర్‌కు చేరి ఊపిరి పీల్చుకుంటున్నారు. ఇక ప్రభుత్వ ఆఫీసుల సమూహం వద్ద కుక్కలు హల్‌చల్ చేస్తున్నాయి.



కుక్క కాటు బాధితుడు (ఫైల్)

వెలగని వీధి దీపాలు..

పట్టణంలోని 20 వార్డులు ఉండగా.. 24.5 చ.కి.మీల విస్తీర్ణం ఉంది. దాదాపు 62 వేల జనాభ కల్గిన పట్టణంలో.. చాలా వీధుల్లో వీధి దీపాలు వెలగని దుస్థితి. దీంతో ఆయా ప్రాంతాల ప్రజలు కుక్కల ధాటికి ప్రాణాలు అరచేతిలో పెట్టుకోవాల్సిన దుస్థితి. ప్రధానంగా శివారు ప్రాంతాలైన 13 వార్డులోని పీతుల దొరువు, మంగళమాన్యం, కొండకింద ఏరియా, 1వ వార్డు శివనగర్ కాలనీ, కొండకింద కాలనీ, 10వ వార్డు పాతూరు. 2వ వార్డు రాజీవ్ నగర్ కాలనీ, 6,7 వార్డుల్లోని శంఖవరం, మాచవరం, 11వ వార్డులోని కాశిపురం, కాశిరెడ్డి కాలనీ తదితర ఏరియాల్లో కొన్ని వీధులు రాత్రి వేళ అంధకారంగా దర్శనమిస్తున్నాయి. వీధి దీపాలకు, కొత్త లైట్లకు అంటూ రూ.లక్షల నిధులు ఖర్చు చేస్తున్నా.. క్షేత్ర స్థాయిలో అవి వీధుల్లో వెలగడం లేదని.. ప్రజలు, ప్రజాప్రతినిధులు తీవ్రంగా మండిపడుతున్నారు. దీనికి తోడు వీధుల్లో సరిగా వీధి దీపాలు వెలగక పోవడంతో పట్టణ ప్రజలు రాత్రి వేళ్ల పడే అవస్తలు వర్ణణాతీతం.

నామ మాత్రపు చర్యలు ...

కుక్కల నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని వార్డు సభ్యులు, అనేక మంది మున్సిపల్ సమావేశంలో గగ్గోలు పెట్టారు. కుక్కల నియంత్రణకు కేంద్ర ప్రభుత్వం అమలులోకి తెచ్చిన యాంటి బర్త్ కంట్రోల్ (ఏబీసీ) కార్యక్రమం ద్వార కుక్కలకు స్టెరిలైజేషన్ ఆపరేషన్లు చేయించి సంతతి పెరగకుండా నియంత్రించ వచ్చు. అయితే మున్సిపల్ అధికారులు అటువంటి ప్రయత్నమే చేయక పోవడం శోచనీయం. ఈ విధానంలో మున్సిపాలిటీ ఒక్కో కుక్కకు రూ.800 వరకు చెల్లించాల్సి ఉంటుంది. మున్సిపాలిటీలో రూ.లక్షల జనరల్ ఫండ్‌ను రకరకాల అలంకరణలు, సుందరీకరణల పేరుతో సుమారు మూడు నెలల్లో రూ.15 లక్షలకు పైగా ఖర్చు పెట్టినట్లు సమాచారం. కానీ ప్రజా సంక్షేమం, ఆరోగ్య రక్షణ కోసం ఖర్చుపెట్టక పోవడం. కనీసం ఆ వైపుగా దృష్టి పెట్టక పోవడంపై ప్రజలు మున్సిపల్ అధికారు తీరుపై తీవ్రంగా మండిపడుతున్నారు.

కుక్క కాటుకు గురైన వెంటనే ఆస్పత్రికి రావాలి:



కుక్క కరిచిన వెంటనే క్షతగాత్రులు ప్రభుత్వ ఆస్పత్రికి రావాలి. ప్రభుత్వ అసుపత్రిలో ర్యాబిస్ ఇంజక్షన్లు వేయించుకోవాలి. కుక్క కాటు మందుకు ఎటువంటి కొరత లేదు. ర్యాబిస్ వ్యాక్సిన్ మందు సంవృద్ధిగా ఉన్నాయి. ఒక బాధితుడికి నెలలో నాల్గు డోస్‌లు వేయాలి. కుక్క కాటుకు గురైన వారు 1, 3, 7, 28 రోజుల్లో ర్యాబిస్ వ్యాక్సిన్‌ను వేయించుకోవాలి.

డాక్టర్ సుబ్బయ్య, ఆస్పత్రి సూపరిండెంట్

రెండు రోజుల్లో కుక్కలను పట్టిస్తాం :



పట్టణంలోని రెండు రోజుజుల్లో వీధికుక్కల నివారణకు చర్యలు తీసుకుంటాం. కుక్కలను పట్టుకునేవారిని పిలిపిస్తున్నాం. ఒంగోలులోని ఓ ఏజెన్సీ ద్వార రోజుకు 25 కుక్కలకు ఏబీసీ వ్యాక్సిన్ వేయించనున్నాం. వీధి లైట్లు వెలగని చోట్ల వెంటనే కొత్త లైట్లు వేయిస్తా. కొత్తగా స్తంభాలు వేసిన చోట కొన్ని ప్రాంతాల్లో లైట్లు బిగించని విషయం వాస్తవమే. వారం రోజుల్లో అన్ని స్తంభాలకు లైట్లు వెలిగే విధంగా చర్యలు తీసుకుంటాం. మున్సిపాలిటీలో కుక్కల సమస్యపై ప్రత్యేక దృష్టిపెట్టి చర్యలు తీసుకుంటా.

డానియేల్ జోసఫ్, కమిషనర్, కనిగిరి)

బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలి



హనుమంతునిపాడులో వారోత్సవాల్లో పాల్గొన్న కార్యకర్తలు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ బ్రహ్మయ్య



పౌష్టికాహారం తినుబండారాలను ప్రదర్శిస్తున్న ఎంపీపీ, ఎంపీడీఓ

టంగుటూరు: బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలని సీడీపీఓ మల్లీశ్వరి అన్నారు. పోషణ పక్వాడ కార్యక్రమంలో భాగంగా మంగళవారం జయవరంలో పోషకాహార వారోత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీడీపీఓ మల్లీశ్వరి లబ్ధిదారులతో మాట్లాడుతూ అన్ని రకాల ఆహారం తీసుకునేలా చూడాలన్నారు, ప్రోటీన్లు, కొవ్వులు, విటమిన్లు, కార్బోహైడ్రేట్ నాలుగు రకాల ఆహారం తీసుకునేలా చూడాలన్నారు. సూపర్‌వైజర్ జ్యోతి, అంగన్‌వాడీ కార్యకర్తలు, కిషోర బాలికలు పాల్గొన్నారు.

కొండపి: ప్రతి ఒక్కరూ పౌష్టికాహారం తీసుకోవాలని సీడీపీఓ మాధవీలత అన్నారు. పోషణ్ పక్వాడ వారోత్సవాల్లో భాగంగా మంగళవారం స్థానిక దాసరెడ్డిపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పౌష్టికాహారం ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి దోహదపడుతుందన్నారు. కౌమార దశలో ఉన్న బాలికలు, గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవడంపై దృష్టి సారించాలన్నారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్ విక్టోరియా రాణి, బాలింతలు, చిన్నారులు, గర్భిణులు తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో రక్తహీనతకు దూరం

పామూరు: గర్భిణులు, బాలింతలు, చిన్నపిల్లల తల్లులు, కిశోరబాలికలు పౌష్టికాహారాన్ని తీసుకోవడం ద్వారా రక్తహీనతకు దూరంగా ఉండి సంపూర్ణ ఆరోగ్యంగా ఉండవచ్చని ఎంపీపీ గంగసాని లక్ష్మి, ఎంపీడీఓ ఎల్.బ్రహ్మయ్య అన్నారు. పౌష్టికాహార పక్షోత్సవాలలో భాగంగా స్థానిక వెలుగు కార్యాలయంలో మంగళవారం పౌష్టికాహారంపై అవగాహన కార్యక్రమం ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు గోళ్ల పద్మజ, ఎంవీఎస్.పార్వతి అధ్యక్షతన నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ పౌష్టిక విలువలతో కూడిన చిరుధాన్యాలు, ఆకుకూరల వంటివి క్రమం తప్పకుండా తీసుకోవాలన్నారు. గర్భిణులు, బాలింతలు, చిన్నపిల్లల తల్లులు, కిశోర బాలికలు ప్రభుత్వం అందించే పాలు, గుడ్లు, డ్రైఫ్రూట్స్, చిక్కీలు సమయపాలన పాటిస్తూ తీసుకోవాలని తద్వారా రక్తహీనతను అధికమించవచ్చన్నారు. ఎంఈఓ జి.కరుణకుమారి, ఎన్‌జీఓ నాయబ్‌రసూల్, వి.వి.నాగవాణి, రమీజా, అనిత అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

సీఎస్‌పురం(పామూరు): అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇచ్చే పౌష్టికాహారాన్ని గర్భిణులు, బాలింతలు, చిన్నపిల్లల తల్లులు క్రమం తప్పకుండా తీసుకుని వినియోగించుకోవాలని ఎంపీడీఓ ఎల్.బ్రహ్మయ్య, ఎంఈఓ రాజాల కొండారెడ్డిలుఅన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో మంగళవారం పౌష్టికాహార పక్షోత్సవాలు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కె.దేవకృపావరం అధ్యక్షతన నిర్వహించారు. ఈసందర్భంగా వారు అంగన్‌వాడీకేంద్రాల్లో ఇచ్చే పౌష్టికాహారం, ఉపయోగాలు వివరించారు. డాక్టర్ హోమద్యుతి గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు.

హనుమంతునిపాడు: పోషణ్ పక్వాడ వారోత్సవాల్లో భాగంగా స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలు, కిషోర బాలికలకు అవగాహన కల్పించారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషకాలున్న ఆహారాన్ని ఏ విధంగా తీసుకోవాలో వివరించారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్ షేక్ గౌస్‌నీషాబేగం, కార్యకర్తలు యక్కటి రాధమ్మ పగడాల లలిత, ఆరోగ్య కార్యకర్తలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

శీతల గిడ్డంగుల్లో బేళ్ల వివరాలు తెలియజేయాలి

- వేలం నిర్వహణాధికారి శ్రీనివాసరావు



టంగుటూరులో వేలం నిర్వహిస్తున్న వేలం నిర్వహణాధికారి శ్రీనివాసరావు

టంగుటూరు: రైతులంతా శీతల గిడ్డంగుల్లో ఉన్న బేళ్ల వివరాలను, వాటి నుంచి బయటకు తీసేటప్పుడు బోర్డు వారికి తెలియజేయాలని వేలం నిర్వణా నాధికారి శ్రీనివాసరావు అన్నారు. బేళ్లలో అన్య పదార్థాలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. రైతులెవ్వరూ అనధికారికంగా పొగాకు అమ్మరాదని తెలిపారు. మంగళవారం జరిగిన వేలానికి కె.చిర్రికూరపాడు, పంగులూరివారిపాలెం గ్రామాలకు చెందిన రైతులు 533 బేళ్లను తీసుకురాగా 464 బేళ్లను కొనుగోలు చేసి 69 బేళ్లను తిరస్కరించారు. గరిష్ట ధర రూ.280, కనిష్ట ధర రూ.225, సరాసరి రూ.257.93 పలికింది. వేలంలో 19 కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారని నిర్వహణాధికారి శ్రీనివాసరావు తెలిపారు.

అగ్ని ప్రమాదాలపై అవగాహన అవసరం




ప్రజలకు అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక అధికారి వెంకటరావు

కొండపి: అగ్ని ప్రమాదాలపై ప్రతిఒక్కరూ అవగాహన పెంచుకోవాలని అగ్నిమాపక కేంద్రం అధికారి సీహెచ్ వెంకటరావు అన్నారు. స్థానిక బస్టాండ్ ఆవరణలో మంగళశారం అవగాహనా కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రమాదం సంభవించిన వెంటనే అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించాలని సూచించారు. అగ్నిమాపక సిబ్బంది, ప్రయాణికులు పాల్గొన్నారు.

కనిగిరిరూరల్: ప్రతి ఒక్కరూ అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్గి, అప్రమత్తంగా ఉండాలని అగ్నిమాపక అధికారి సీహెచ్ బంగారు బాబు అన్నారు. పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్, డిపో గ్యారేజ్, కాశిరెడ్డి కాలనీ, చింతల పాలెం ఏరియాల్లో జాతీయ అగ్ని మాపక వారోత్సవాల్లో భాగంగా అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పిఐచారు. అనంతరం అగ్నిమాపక అధికారి సీహెచ్ బంగారుబాబు మాట్లాడుతూ అగ్ని ప్రమాదాలు గ్యాస్, ఎలక్ట్రికల్, ఆయిల్ తదితర అగ్ని ప్రమాదాలు, అవి సంభవించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. ఏరకం ప్రమాదం జరిగినప్పుడు ఎలా తప్పించుకోవాలి, వాటి బారినుంచి ఎలా రక్షింప బడాలి తదితర విషయాలను డెమో అగ్నిమాపక సిబ్బంది వివరించారు. అగ్ని ప్రమాదాలపై అవగాహన ఉన్నప్పుడు తక్షణం వాటినుంచి రక్షణ పొందడం సులభ తరంగా ఉంటుందని.. ఎటువంటి ప్రమాదానికి గురి కాకుండా తప్పించుకోవచ్చాన్నారు. అనంతరం అగ్ని ప్రమాదాల నివారణకు, అవగాహన కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో డీఎం ఎస్కే మొహమ్మద్ సయానా బేగం, అగ్నిమాపక అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య రాష్ట్ర కార్యదర్శిగా ఉమాకాంత్



మారెళ్ల ఉమాకాంత్‌ను అభినందిస్తున్న సంఘ నాయకులు

కనిగిరిరూరల్: ఏపీ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య రాష్ట్ర కార్యదర్శిగా కనిగిరికి చెందిన మారెళ్ల ఉమాకాంత్, పురోహిత విభాగం రాష్ట్ర కార్యదర్శిగా తిమ్మరాజు వంశీ కృష్ణాలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మంగళవారం ఏలూరులోని అంబికా రెసిడెన్సీలో జరిగిన రాష్ట్ర బ్రహ్మణ సంఘ ఎన్నికల్లో కనిగిరికి చెందిన వీరు నియమితులయ్యారు. ఈమేరకు నూతనంగా ఎన్నికైన ఉమాకాంత్‌ను, తిమ్మరాజును సంఘ నాయకులు అభినందించారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు దామరాజు క్రాంతికుమార్, రెంట చింతల మధుసూదన్ శర్మ, బ్రహ్మణ సంఘ మాజీ అధ్యక్షుడు పరశు సత్యగోపాల్, సాయిబాబాగుడి ఉపాధ్యక్షుడు సింగరాజు మాల కొండేశ్వరరావు, ఆగస్త్యరాజు హనుమంతరావు, ఎన్‌జీఓ సంఘ నాయకులు మతుకుమల్లి భాస్కర్ పాల్గొన్నారు.

21న మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్ష

కనిగిరిరూరల్: ఆదర్శ పాఠశాలల్లో 2025-26 విద్యా సంవత్సరానికి ఆరో తరగతిలో ప్రవేశానికి ఈ నెల 21న ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు కనిగిరి ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ డాక్టర్ తులసీ పద్మావతి తెలిపారు. మంగళవారం ఆమె విలేకర్లతో మాట్లాడారు. 20వ తేదీ జరగాల్సిన పరీక్షా ఈస్టర్ పండుగ కారణంగా వాయిదా వేసినట్లు తెలిపారు.

దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఈ విషయాన్ని గమనించాలన్నారు. విద్యార్థులు హాల్ టికెట్లు వెబ్ సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. ప్రవేశ పరీక్షపై ఈ నెల 16న ఉదయం 9 గంటలకు అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఘనంగా మంగమ్మ తిరునాళ్ల



ప్రత్యేక లకంకరణలో మంగమ్మ గరటయ్య స్వామి

హనుమంతునిపాడు: మండల పరిధి నందనవనం పంచాయతీ మంగమ్మపల్లిలో వెలసిన మంగమ్మ తల్లి గరటయ్య స్వామి తిరునాళ్ల మంగళవారంతో ముగిసింది. నందనవనం ఎంపీటీసీ సూరిశెట్టి నారాయణస్వామి ఆధ్వర్యంలో చివరి రోజు ఏర్పాటు చేసిన పాటకచ్చేరికి అలరించింది. పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు మంగమ్మ గరటయ్య స్వామికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. తిరునాళ్ల మహోత్సవంలో భాగంగా రెడ్డి కార్పొరేషన్ చైర్మన్ చింతలచెరువు సత్యనారాయయరెడ్డి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చ ఎన్నికల్లో మంగమ్మ తల్లి ఆశీస్సులతో వైఎస్సార్ సీపీ తప్పక అధికారంలోకి వస్తుందన్నారు. కన్వీనర్ యక్కంటి శ్రీనివాసులరెడ్డి, ఎంపీపీ గాయం సావిత్రి, మాజీ ఎంపీపీ గాయం బలరామిరెడ్డి, యూత్ అధ్యక్షుడు భవనం క్రిష్ణారెడ్డి, ఎంపీటీసీ నారాయణస్వామి, బంకా నరిసింహులు సాంబిరెడ్డి, చిట్యాల విజయ్ భాస్కర్‌రెడ్డి, బంకా నరిసింహులు, భవనం క్రిష్ణారెడ్డి,ఏరువ వెంకటరెడ్డి, రమణారెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చింతల చెరువు సత్యనారాయణరెడ్డి

లైసెన్స్ లేకుండా నిల్వ ఉంచితే చర్యలు



బాణసందా నిల్వలు పరిశీలిస్తున్న డీఎస్పీ

పామూరు: లైసెన్స్ లేకుండా బాణసంచా నిల్వ ఉంచితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని కనిగిరి డీఎస్పీ పి.సాయి ఈశ్వర్ యశ్వంత్ అన్నారు. స్థానిక సర్కిల్ కార్యాలయంలో మంగళవారం కనిగిరి సబ్‌డివిజన్ పరిధిలోని సీఐ, ఎస్సైలతో నెలవారీ క్రైమ్ రివ్యూ సమావేశం నిర్వహించారు. అనంతరం జరిగిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ మాట్లాడుతూ ఫ్యాన్సీ దుకాణాలు, జనావాసాల మధ్య దుకాణాల్లో బాణసంచా నిల్వ ఉంచరాదన్నారు. చిన్నపాటి పొరపాటుజరిగినా ప్రణాలు కోల్పోయే అవకాశం ఉందని, ఇటీవల అనకాలపల్లిలో ప్రమాదాన్ని గుర్తుచేశారు. చోరీల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. బయటకు వెళ్లే సమయంలో తాళాలు వేసి పక్క వారికి సమాచారం ఇవ్వడం మంచిదన్నారు. పోక్సో కేసులు ఎక్కువగా నమోదవుతున్న నేపథ్యంలో అవగాహనా కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. సీఐ ఎం భీమానాయక్, ఎస్సై టి.కిషోర్‌బాబు, సీఎస్‌పురం ఎస్సై ఆర్.సుమన్, వెలిగండ్ల ఎస్సై జి.కృష్ణపావని తదితరులు పాల్గొన్నారు.